## కథ

# పక్కింటి పెళ్లాం!

'కన్నెపిల్లల్ని ముగ్గులోకి దించడం చాలా కష్టం. ఎందుకంటే కన్ను కలిపితే కంగారుపడతారు. పలకరిస్తే బెదిరిపోతారు. నానాతంటాలు పడి పరిచయం పెంచుకున్నా, ప్రేమపాఠాలు అప్పచెప్పినా ఏకాంతం అంటే భయపడతారు. ముట్టుకోనివ్వరు. పట్టుకోనివ్వరు. ముద్దు పెట్టుకోనివ్వరు. వాళ్లతో అంతా న్యూసెన్సే. పోనీ... చచ్చీచెడీ ఏదో ఒకలా కౌగిట్లోకి తెచ్చుకున్నా అక్కడా సవాలక్ష ఆంక్షలు! అనుమానాలు, షరతులు! అంతా అయ్యాక 'సర్వస్వం నీకే అర్పించేశాను కనుక పెళ్లి చేసుకుంటావా? చస్తావా? అన్న వేధింపులు.

పెళ్లయిన ఆడాళ్లతో పరిచయం పెంచుకోవడం చాలా తేలిక. మంచినీళ్లనో, మంచితనాన్నో అడ్డుపెట్టుకుని కోటలో పాగా వేసెయ్యవచ్చు. ఆ తర్వాత అన్ని పన్లు వాటంతట అవే చకచకా జరిగిపోతాయి. పైగా పెళ్లయిన వాళ్లు అన్నిటిలోనూ ఆరితేరి వుంటారు కనుక వాళ్లతో వ్యవహారం అమర్చిన పూలపక్క. నల్లేరు మీద బండి నడక.

అందుకే కన్నెపిల్లలకీ, పెళ్లికాని పిల్లలకీ లైనేసుకోవాలనే ఆలోచన శుద్ధవేస్ట్. అలాంటి వాళ్లని రంగంలోకి దించాలని చూసే మగాడొట్టి ఫూల్. చక్కగా ఎదురింటి ఆంటీలకీ, పక్కింటి పెళ్లాలకీ లైనేసుకునేవాడే చాలా తెలివైనవాడు. కనుకనే తను పెద్ద మేధావి అని ప్రతాప్ ఎస్పి అభిప్రాయం.

ఎస్పి అంటే ఏ పోలీసో అనుకుంటారేమో కాదు సుమా! 'శృంగార పురుషుడు' అని మాత్రమే అర్థం.

ఇలాంటి ప్రతాప్‌కి రీసెంట్‌గా పక్కింటి పెళ్లాం చాలా బాగా నచ్చేసింది. ఆమెకి చెంపకి చారెడు కళ్లు, అద్దాల్లాంటి చెక్కిళ్లు...వగైరా వగైరాలేవీ లేకపోయినా ఎదుటివాళ్ల చూపుల్ని చటుక్కున తనవైపు తిప్పుకోగల బారెడు జడ మాత్రం వుంది.

నిజానికి బారెడు పొడవున్న ప్రతి జడా మగాణ్ణి తనవైపు తిప్పుకోలేదు. నల్లని రంగుతో, ఒకరకమైన నిగనిగల్తో లావుగా, తాచులా పొడవుతోపాటు ఒకరకమైన సెక్సీనెస్సూ...ఇంకొంచెం ఎట్రాక్షన్నూ వున్న జడలకి మాత్రమే మగాణ్ణి ఆకట్టుకోగల సత్తా వుంటుంది.

పక్కింటి పెళ్లానికున్న జడ కూడా అలాంటిది కనుకనే ప్రతాప్ అటువైపు ఎట్రాక్టయ్యాడు. ఆ రోజు లగాయతూ ఆమెని పరిచయం చేసుకోవడం కోసం నిద్రాహారాలు మానేసి మరీ రకరకాల ప్రణాళికలు, వ్యూహాలు రూపొందించాడు. అన్నీ పగడ్బందీగా ఉన్నాయని రూఢి అయిన తర్వాత ఓ మంచి ముహూర్తంలో రంగంలోకి దిగాడు.

ఆ రోజు...ఫారెన్ పెర్ఫ్యూమ్ ఒంటికి పూసుకుని టిప్‌టాప్‌గా తయారై పూలరంగడిలా పక్కింటికి కదిలాడు ప్రతాప్. అతనక్కడికి చేరేసరికి ఆమె పూలమాల కట్టుకుంటోంది.

ఒద్దికగా కుర్చీలో కూర్చుని ఒళ్లో పువ్వుల పళ్లెం పెట్టుకుని కుడిచేతి వేళ్లతో నాజూగ్గా పువ్వుల్ని తీస్తూ ఎడమ చేతివేళ్లతో సుతిమెత్తగా పట్టి సున్నితంగా దండ అల్లుతుంటే చకచకా కదుల్తున్న వెండితీగల్లాంటి వేళ్లు, లేత గులాబీరంగుగోళ్లు...ఇవన్నీ ఒక ఎత్తయితే...!

భుజం మీంచి ముందుకొచ్చి ఎదలోయల్లోంచి జారి ఒళ్లోంచి కిందకి వాలిన ఆమె బారెడు జడ మరో ఎత్తయింది. ఆమెని ఎంతసేపయినా అలా చూస్తూనే ఉండిపోవాలనిపించింది. కానీ...వ్యవహారం చూపుల్లోనే ఉంచేస్తే ఇక చేతలుండవన్న నగ్నసత్యం గుర్తు రావడంతో వాస్తవంలోకొచ్చాడు.

చిన్నగా తలుపులు తట్టాడు.

పువ్వులు కట్టుకుంటున్న ఆమె ఆ శబ్దానికి చటుక్కున తలెత్తింది. ఎదురుగా కనిపించిన ప్రతాప్‌ని చూసి భృకుటి ముడేసింది.

''కొంచెం మంచినీళ్లుంటే ఇస్తారా?'' చేతిలోని వాటర్ జగ్‌ని ఆమెకి కనిపించేలా పట్టుకుంటూ అడిగాడు ప్రతాప్.

అతనొచ్చిన పనేమిటో అప్పుడర్థమయింది ఆమెకి. చేస్తున్న పనాపి ఇవతలకొచ్చి అతని చేతిలోంచి వాటర్ జగ్ అందుకుంది. లోపలికి వెళ్లి రెండు నిముషాల్లో తిరిగొచ్చింది.

''మెనీ మెనీ థాంక్స్'' మంచినీళ్లు అందుకుని ఆమె ముఖంలోకి చూస్తూ చెప్పాడు. చిన్నగా నవ్వేసి అతనివైపు చూడకుండానే లోపలకు వెళ్లిపోయింది.

అతను నిరుత్సాహపడలేదు. ఎందుకంటే మొదటి రోజే మంచినీళ్లు తెచ్చి ఇచ్చేలోపు ఎవరూ లోపలికొచ్చి కూర్చోమని ఆహ్వానించరు. అసలలా జరగడానికి వారం పైనే పడుతుంది. అదతని స్వానుభవం. అందుకే హుషారుగా ఈలేసుకుంటూ రూంలోకి నడిచాడు.

ఆ రాత్రి తనని ఆమె లోపలికి ఆహ్వానించినట్టు, తనతో మాట్లాడినట్టు, పరిచయం పెరిగినట్టు, తనామెని పెనవేసుకున్నట్టు, ఆమె జడతో మెడకి ముడివేసుకున్నట్టు... ఇలా ఒక్కటేమిటి ఎన్నెన్నో... అన్నీ రంగురంగుల కలలే. ఆ కలలు ఎప్పటికయినా నిజమవుతాయని అతనికి ఖచ్చితంగా తెలుసు. అందుకే రాత్రి వచ్చిన కలల్ని తల్చుకుని తెల్లారిన తర్వాత కూడా మురిసిపోతూనే ఉన్నాడు.

కాలగర్భంలో వారం గడిచింది.

ఈవారంలో రోజూ ప్రతాప్ పక్కింటికి వెళ్లి మంచినీళ్లు తెచ్చుకుంటూనే ఉన్నాడు. అయితే ఏనాడూ పొరపాటున కూడా అతన్ని లోపలికొచ్చి కూర్చోమని ఆమె అనలేదు సరికదా మంచినీళ్లు ఇచ్చేటప్పుడు ఒక్కసారి కూడా ప్రతాప్ మొహంకేసి చూడలేదు.

అయినా నిరాశ అన్నది అసలతని దగ్గర కూడా రాలేదు.

ఎందుకంటే పెళ్లయిన తర్వాత కూడా కన్నెతనపు భయాలుపోని భార్యలు అక్కడక్కడా ఉంటారు. ఈ పక్కింటి పెళ్లాం కూడా ఆ కోవలోనిదే అని సరిపెట్టుకున్నాడు.

రోజులు గడుస్తున్నాయి.

ప్రతాప్ పట్టువదలని విక్రమార్కుడిలా ఆమెకోసం ప్రయత్నిస్తూనే ఉన్నాడు. రెండు మూడుసార్లు ఆమెని పలకరించబోయాడుగానీ అతని ప్రయత్నాల్ని ఆమె చాలా తెలివిగా తిప్పికొట్టింది.

అతను భయపడలేదు. బాధపడలేదు. ఆడదానికి బెట్టు సహజం అని సరిపెట్టుకున్నాడు. ఆమెని తన విశాల హృదయంతో క్షమించేశాడు.

ఆ మర్నాడు-

రోజుకంటే కొంచెం ఎక్కువ సమయం తీసుకుని ఇంకొంచెం శ్రద్ధగా తయారయ్యాడు.

''ఇవాళ ఖచ్చితంగా ఆ పక్కింటి పెళ్లాం నన్ను లోపలకు రమ్మంటుంది. వీలయితే నాతో కాస్సేపు మాట్లాడుతుంది కూడా!'' అద్దంలో తనని తాను చూసుకుంటూ అనుకున్నాడు.

ఫినిషింగ్ టచెస్ పూర్తి చేసుకుని వాటర్ జగ్ అందుకుంటుంటే తలుపు తట్టిన చప్పుడు వినిపించింది. చేయబోయిన పనిని వాయిదా వేసి వెళ్లి తలుపు తీసాడు.

ఎదురుగా పక్కింటి పెళ్లాం! చేతిలో ప్లాస్టిక్ బిందె.

ప్రతాప్ తన కళ్లను తానే నమ్మలేకపోయాడు.

''లోపలికి రండి'' ఆశ్చర్యంలోంచి తేరుకుంటూ ఆహ్వానించాడు.

ఆమె లోపలికి రాలేదు. నిల్చున్న చోటు నుంచి కూడా అంగుళం కూడా కదల్లేదు. కానీ చేతిలో వున్న ప్లాస్టిక్ బిందెని మాత్రం ఇద్దరికీ మధ్యగా పెట్టింది.

''అరె! నేనే మీ ఇంటికి మంచినీళ్లకి వద్దామని అనుకుంటున్నాను. ఈలోపల మీరే వచ్చేశారన్నమాట. అయినా మీరు రాంగ్ అడ్రస్‌కొచ్చారు. ఇంత బిందెడు మంచినీళ్లు, బేచిలర్‌గాణ్ణి నా దగ్గర ఎలా ఉంటాయి చెప్పండి?'' నవ్వుతూ అన్నాడు.

అప్పుడు పెదవి విప్పిందామె.

''నేనొచ్చింది మంచినీళ్లకికాదు'' మెల్లగా అంది.

''మరి?''

''ఈ బిందెని మీకిచ్చిపోదామని. మీరు మంచినీళ్లకి ఇబ్బంది పడకుండా ఉండాలని మార్కెట్‌నుంచి మీకోసం ఈ బిందెని కొనుక్కొచ్చాను. ఇకనుంచయినా నల్లా వచ్చే టైమ్‌కి జాగ్రత్తగా నీళ్లు పట్టుకుని ఉంచుకోండి. లేకపోతే మీవల్ల మీ పక్క పోర్షన్ వాళ్లేకాదు, మాలాంటి పక్కింటివాళ్లు కూడా ఇబ్బంది పడాల్సి వుంటుంది. మన పనికోసం చుట్టుప్రక్కలవాళ్లని ఇబ్బంది పెట్టడం మంచి పద్ధతికాదు'' చెప్పేసి అతని ముఖంలోకి చూసింది.



ఈవారంలో రోజూ ప్రతాప్ పక్కింటికి వెళ్లి మంచినీళ్లు తెచ్చుకుంటూనే ఉన్నాడు. అయితే ఏనాడూ పొరపాటున కూడా అతన్ని లోపలికొచ్చి కూర్చోమని ఆమె అనలేదు సరికదా మంచినీళ్లు ఇచ్చేటప్పుడు ఒక్కసారి కూడా ప్రతాప్ మొహంకేసి చూడలేదు. అయినా నిరాశ అన్నది అసలతని దగ్గర కూడా రాలేదు.



ప్రతాప్ ముఖంలో కత్తివాటుకి నెత్తురు చుక్క లేదు.

''నే చెప్పింది మర్చిపోకండి'' మరోసారి హెచ్చరించింది.

చెప్పుతో కొట్టకుండా, నలుగురిలో నవ్వులపాలు చేయకుండా కేవలం మాటలతో కొట్టి ఠీవిగా వెళ్లిపోతున్న ఆమెని నిశ్చేష్టుడై చూస్తుండిపోయాడు ప్రతాప్.

పక్కింటి పెళ్లాల్ని తేరగా కౌగిట్లోకొచ్చే పదార్థాలుగా భావించే ప్రతాప్‌కి అప్పుడే మొదటిసారిగా అర్థమైంది 'మొగుడి చాటున గుట్టుగా సంసారం చేసుకునే ఆడవాళ్ల జోలికెళితే అవమానాలు తప్పవని!'

ఆ క్షణంలో అతను ఒకటే అనుకున్నాడు. పెళ్ళయి భర్త చాటున జీవితం సాగించే ఆడాళ్లని పరిచయం చేసుకోవడం చాలా కష్టం. వాళ్లు పరాయి మగాడికేసి కన్నెత్తి చూడరు. పన్నెత్తి పలకరించరు. పరాయి మగాడు తమ జోలికొస్తే అస్సలు సహించరు. పెళ్ళయిన ఆడాళ్లని ఆశించడమంత ప్రమాదం మరోటుండదు అని!

**అగస్త్యప్రగడ హేమంత**

★